సాయంత్రం నాలుగు గంటలయింది. ఎండ తగ్గుముఖం పట్టింది.

రంగనాథ్ ఇంట్లోనుంచి బయటకు వచ్చాడు. చేతిలో ప్లాస్టిక్ బుట్ట వున్నది. అందులో మంచినీళ్ల సీసా, ఫ్లాస్కులో కాఫీ, చిన్న డబ్బాలో ఇంత ఉప్మా, ఓ తువ్వాలూ వున్నాయి.

అతడు ఆసుపత్రికి బయల్దేరాడు. ఆర్టీసీ బస్సు దొరకాలి. అంతదూరం ప్రయాణం చేయాలి..అసలే ఆదివారం. చూస్తూ చూస్తూ ఆటోకి ముప్ఫయి రూపాయలు పెట్టాలన్నా కష్టమే. రోజు మొత్తంమీద రెండుమూడు సార్లు ఎవరో ఒకరు వెళ్లాలి. ఎక్కువగా తల్లే అక్కడ వుంటున్నది. అతనుగాని, సావిత్రిగాని వెళ్లి అక్కడ కావాల్సినవి ఇచ్చి వస్తుంటారు.

రంగనాథ్ జేబులో పాసు వున్నదో లేదో ఒకసారి చూసుకున్నాడు. అతడి ఆఫీసు కూడా అటువైపే వుండడంతో అతడికి ఆ పాసు అన్నివిధాలా ఉపయోగకరంగా వున్నది.

అతడు గేటు దాటుతుండగా, ''రంగనాథ్'' అన్న పిలుపు వినబడింది.

వెనక్కు తిరిగాడు రంగనాథ్. ఇంటి యజమాని పిలిచాడు. ఆయనకు డబ్బైయేళ్లదాకా వుంటాయి. సన్నగా రివటలా వుంటాడు. ప్రభుత్వోద్యోగం చేసి రిటయిరయ్యాడు. ఎప్పుడూ ఇంటి పట్టునే వుంటాడు.

''ఎలా వున్నది నాన్నకు'' అన్నాడు దగ్గరకు వస్తూ.

''ఏమీ చెప్పలేమంటున్నారు డాక్టర్లు...వాళ్ల ప్రయత్నాలయితే వాళ్లు చేస్తున్నారు...ఇక భగవంతుడి దయ'' అన్నాడు దిగులుగా రంగనాథ్.

''పెద్ద డాక్టర్లను కలవలేదా?''

''అందరినీ కలవడమయింది...ఎవరు మాత్రం ఏం చేయగలరు?...కోమాలో వున్నాడు. వయస్సా రేపు అమావాస్యకు ఎనభై దాటుతుంది...వాళ్ల ఉద్దేశ్యంలో వారం రోజులకు మించి గడవటం కష్టమే!'' చాలా నిరాశగా, దిగులుగా అన్నాడు రంగనాథ్ ఆయన్నే చూస్తూ.

''నిజమేలే...మన చేతిలో ఏమున్నది...పైవాడు ఎప్పుడు రావాలీ అంటే అప్పుడు వెళ్లిపోవాలి...తప్పేదేవున్నది!'' అన్నాడు రెండు చేతులూ పైకెత్తి ఆకాశంలోకి చూస్తూ.

రంగనాథ్ ఇంక మాట్లాడేదేం లేదన్నట్లుగా గేటుతీశాడు బయట కాలు పెట్టేటందుకు.

''ఒక్కమాట!'' చిన్నగా అన్నాడాయన.

''చెప్పండి'' అన్నాడు రంగనాథ్ ఆయనేమైనా సలహా ఇస్తాడేమో నన్నట్లుగా ఆగి. గేటుమీద నుంచి చేయి తీయలేదు.

''ఏం లేదు...మా గోపి పెళ్లయి ఇంకా మూడునెలలు కూడా కాలేదు...మండిగానికి కట్టిన మామిడి మండలు కాని, గడపలకు రాసిన పసుపు కుంకుమలు గాని ఇంకా రాలనేలేదు...అందుకని...అందుకని మీరు వేరే ఇల్లు చూసుకుంటే బాగుంటుందయ్యా! నువ్వు నన్ను అపార్థం చేసుకోవద్దు!'' అన్నాడు చిన్నగా నీళ్లు నములుతూ.

ఆయన మాటలకు ఉలిక్కిపడ్డట్టుగా తలెత్తాడు రంగనాథ్.



# విజ్ఞత

''ఏవంటున్నారు?'' అయోమయంగా చూస్తున్నాడు.

అథాట్టుగా నెత్తిన ఏదో దభీమని పడ్డట్లనిపించింది అతడికి. కలలో కూడా ఊహించని విషయం అది!



- పి.ఎస్.నారాయణ

''ఏం లేదు...శుభకార్యం జరిగిన సంవత్సరంలోపే అశుభకార్యం జరగడం ఆ గృహానికంత మంచిదికాదనే విషయం నీకు తెలిసిందే కదా!...నాకు వాడొక్కగానొక్క కొడుకు...వాళ్ల జీవితం సుఖంగా వెళ్లిపోవాలని నేను కోరుకోవటంలో తప్పున్నదంటావా?'' అన్నాడు తల వంచుకొని.

కొత్తకోడలు పక్కన చెట్లకు పాదులు తీస్తున్నదల్లా లోపలకు వెళ్లిపోయింది వాళ్ల మాటలు తను వినకూడదన్నట్లుగా-మామగారు తనవైపు చూసిన చూపుని అర్థం చేసుకొని.

రంగనాథ్‌కు నోరు పెగలటం లేదు. అంత సూటిగా ఆ ముసలాయన తమను ఇల్లు ఖాళీ చేయమంటుంటే ఎలా మాట్లాడాలో, ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నోరు తెరుచుకొని శిలావిగ్రహంలా నిలబడిపోయాడు.

''చూడు...కాస్త వీలు చూసుకొని రెండురోజుల్లో ఖాళీ చేయండి!'' ఇంక చెప్పేదేం లేదన్నట్లుగా వెనక్కు తిరిగాడు ఆయన.

''పదేళ్లబట్టీ వుంటున్నాం...ఒక్కసారిగా ఇలా ఖాళీ చేయమంటే- ఆసుపత్రి చుట్టూ తిరగడంతోటే నా పనయిపోతున్నది...మరో ఇల్లు ఇప్పుడెక్కడ వెతగ్గలను!'' అన్నాడు గొంతు జీరపోగా.

''నేనంత కర్కోటకుడినా రంగనాథ్...ఇన్నాళ్లబట్టి కలసి వుంటున్నాం. ఆమాత్రం తెలియదా నా సంగతి నీకు...నేను ఇప్పుడే ఈ క్షణానసే ఖాళీ చేయమనటం లేదే...రెండురోజులు టైం తీసుకో అంటున్నాను గదా... అసలు కారణం కూడా చెప్పానుగదా ఏమీ దాచకుండా!''

ఒక్కక్షణం సంశయిస్తున్నట్లుగా ఆగి రంగనాథ్,



## విలువ

బ్లాక్‌బోర్డ్‌పై '10' సంఖ్యవేసి ''ఇది ఎంతరా'' అని రాంబాబుని అడిగారు టీచర్.

''ఒకటి సార్'' చెప్పాడు రాంబాబు.

''అదేంట్రా నేను వేసిన సంఖ్య 10 కదా.''

''అదికాదు సార్. మీరు ఇప్పుడే కదా '0'కు విలువ లేదు అని చెప్పారు.'' తడుముకోకుండా చెప్పాడు రాంబాబు.

- రావూరి నారాయణరావు (ఎర్రుపాలెం)

## తప్పనిసరి

''ఆ అమ్మాయిని బలవంతంగా ఎందుకని రేప్ చేశావ్?'' అడిగాడు జడ్జి.

''మామూలుగానే ప్రొసీడౌదామనుకున్నాను. కానీ ఆ అమ్మాయి ఎంతకీ ఒప్పుకోకపోతే తప్పలేదు యువరానర్!'' తాపీగా బదులిచ్చాడు ముద్దాయి.

- శ్రీనివాస్ వల్లాల (విఠలాపురం)


## దుర్మార్గులు

''మన పక్కింటి వాళ్ళు ఇప్పుడు ఏం మాట్లాడు కుంటుంటారో?''

''మనం వాళ్ళ గురించి మాట్లాడుకున్నట్లే వాళ్ళూ మనగురించి మాట్లాడుకుంటారు.''

''ఛీ.. ఛీ.. ఎంత దుర్మార్గులు.'' కోపంగా చెప్పింది కుమారి.

- పి.వి. రమణకుమార్ (చిలకలూరిపేట)




''పోనీయ్...పోనీయ్... శవాన్ని ఇక్కడకు తీసుకురా ములేండి...అటునుంచి అటే స్మశానానికి తీసుకువె ళతాం!'' అన్నాడు. అతడి కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగి నయి- ఇంకా బ్రతికే వున్న తండ్రికి అంత్యక్రియల గురించి ఆలోచించాల్సిన అవసరం కలిగినందుకు.

''అది ఎవరైనా చేస్తారులే...దానికి ఆలోచించేదేము న్నది...అమ్మ వస్తుందిగదా ఇంటికి!...'' ఆయన ఇంక ఒక్కక్షణం అక్కడ వుండలేదు. రంగనాథ్ ఆయన మాటలకు విలవిలవాడాడు. చర్రున కోపం వచ్చేసింది. కానీ అవసరం తనది. నిగ్రహించుకో ప్రయత్నించాడు. ఎంత ఆపుకుందామనుకున్న శరీరాన్ని కమ్మిన వణుకు ఆగడం లేదు. ఇంటి యజమానిని నిలువునా చీల్చివే యాలి అన్నట్లుగా కళ్లను కత్తుల్లా చేసి అటేచూస్తూ వుండిపోయాడు చాలాసేపు రంగనాథ్.

ఆసుపత్రికి వెళ్లాలనిపించలేదు. బ్రతికి వున్న తండ్రిని చచ్చిపోయినట్లుగాను, పసుపు కుంకుమలతో నుదుట రూపాయంత బొట్టుతో కళకళలాడుతున్న తల్లిని విధవ గానూ ఊహించుకోలేక పోతున్నాడు. వళ్లంతా చెమ టలు పడుతున్నాయి- అది ఆలోచిస్తుంటేనే!

వెనక్కు తిరిగి తమ భాగంలోకి వెళ్లిపోయాడు. ఎన్నేళ్ల బట్టో వుంటున్న ఆ ఇల్లు ఆ క్షణాన ఓ స్మశానంలా అని పించగా బిక్కుబిక్కుమంటూ వెళ్లి మంచం మీద కూల బడ్డాడు.

''అదే విటి...వెనక్కు వచ్చారు!'' సావిత్రి భర్త దగ్గ రకు వస్తూ అన్నది. ''ఏమైంది?''

ఆమె ఆదుర్దా ఆమెది-మామగారిని గురించిన ఖబు రేమీ అందలేదు కదా!

''ఏం లేదులేగాని...ఆసుపత్రికి నువ్వెళ్లి వస్తావా? నేను ఓ గంటసేపు పడుకుంటాను...బాగా తలనొప్పిగా వున్నది!'' అన్నాడు.

''అలాగే! పడుకోండి...అమృతాంజనం రాయనా?'' అన్నది ఆదుర్దాగా భర్త నుదుటిన చేయి పెట్టి చూస్తూ-జ్వరమొచ్చిందేమోనన్నట్లుగా.

''వద్దులే...కాసేపు పడుకుంటే అదే తగ్గిపో తుంది...నువ్వెళ్లి ఆ బుట్టను అమ్మకిచ్చిరా...ఎక్కువ సేపు వుండద్దులే...మళ్లీ వచ్చి వంట చేయాలి కదా!''

''ఫరవాలేదండి...మీరు పడుకోండి...నేనెలాగో అలాగా అన్నీ చేసేస్తాను కదా!'' అన్నది చిన్నగా నవ్వి.

-అందుకే సావిత్రంటే అతడికి ఎంతో ప్రేమ, అభి మానం! ఇంట్లో ఎన్ని సమస్యలు తలెత్తినా క్షణాలల్లో వాటికి సమా ధానాలు కూర్చుకొని, నిర్ణయాలు తీసుకొని ఏ ఇబ్బందీ కలగకుండా చూసుకుంటుంది.

క్షణం ఆమెనే తదే కంగా చూస్తూ, ''మనం ఈ ఇల్లు ఖాళీ చేయాలి!'' అన్నాడు మంచం మీద పక్కకు తిరుగుతూ. ''నాన్న చచ్చిపోతే ఆ శవం ఇక్కడకు రాగూడదట...అమ్మ ఈ ఇంట్లో కాలు పెట్టగూడదట! ఇంటి యజమానులవారి నిర్ణయం ఇది!'' ఎంత చిన్నగా చెప్పినా కంఠంలోని కరుకుతనాన్ని నిగ్రహించు కోలేకపోయాడు రంగనాథ్.

• • •

సావిత్రి నిద్రపోతున్న రంగనాథ్‌ను లేపింది. అప్పుడు ఉదయం ఏడుగంటలయింది. రాత్రి ఆసుపత్రినుంచి ఆలస్యంగా రావటం, ఆపైన మూడురోజుల క్రితం ఇంటి యజమాని జారీ చేసిన ఆజ్ఞలను ఎలా పాటిం చాలో అర్థంకాకపోవటం అతడిని రాత్రిళ్లు సరిగా నిద్ర పోనీయటం లేదు. ఏ తెల్లవారుఝామునో కునుకు పట్టటం...ఆలస్యంగా లేవటం...ఆఫీసుకు పరుగె త్తటం...

''ఏమిటి?'' అన్నాడు బద్ధకంగా కళ్లు తెరుస్తూ.

''బాత్‌రూంలో నీళ్లు రావడం లేదండి!''

''ఏమైంది?''

''తెలియదు!''

గబగబా లేచి, లుంగీ సరిగ్గా కట్టుకొని, బాత్‌రూం లోకి వెళ్లి పంపు తిప్పి చూశాడు.

''ట్యాంక్‌లో నీళ్లు లేవేమోనే...మోటరు వేయకపోయి నావా?''

''పైకి వెళ్లి చూసొచ్చానండి...ట్యాంకునిండా వున్నాయి నీళ్లు!'' అన్నది-ఏమీ అర్థంకావడం లేదన్న ట్లుగా.

-బాత్‌రూంలో నీళ్లు రాకపోతే ఏ పనీ జరగదు. అందునా ఉదయాన్నే...అంతా చికాకు అవుతుంది.

రంగనాథ్ బయటకు వచ్చాడు. బాత్‌రూం నుంచి బయటకు వచ్చిన పంపు వెంటే చూసుకుంటూ ఇంటి వెనక్కు నడిచాడు. పైన ట్యాంకుకు కలిపివున్న పైపును చూసేటప్పటికి అతడికి అసలు సంగతి అర్థమయిపో యింది. గోడమీద మనిషెత్తులో వున్న వాల్వుకున్న చక్రం లేదు. ఎవరో విరగ్గొట్టినట్లున్నారు. దొడ్లోనుంచే ఇంటి ముసలాయన్ను పెద్దగా పిలిచాడు.

ఆయన వస్తూనే, ''ఏ విటి రంగనాథ్?'' అన్నాడు.

''చూడండి...బాత్‌రూంలో నీళ్లు రావడం లేదు...ఇక్కడ వీల్ విరిగింది...వాల్వ్ మూసేసినట్లు న్నది!'' ఆయన ముందుకు హడావుడిగా వచ్చి, భూత ద్దాల కళ్లజోడును సర్దుకుంటూ, ''అయ్యయ్యో... వంద రూపాయల వాల్వ్ కాస్తా విరిగిపోయిందా?'' అన్నాడు. ''ఎవరు తిప్పారు దాన్ని?''

''నాకేం తెలుస్తుందండీ...పొద్దుటినుంచీ నీళ్లు రాక పోతుంటే సావిత్రి నాకు చెప్పింది...చూస్తే ఇదీ సంగతి!''

''అబ్బబ్బ! ఈ దొంగలకు బుద్ధీ జ్ఞానం లేకుండా పోతోంది...వాడికి ఆ చక్రానికి వచ్చేది పావలానో, అర్ధ రూపాయో...కాని మనం దాన్ని మార్చి బాగుచేయించా లంటే కనీసం రెండుమూడొందలు ఖర్చుపెట్టాలి!'' అన్నాడు నెత్తి కొట్టుకుంటూ.

''ముందు మాకు నీళ్లు వచ్చే సంగతి

చూడండి...డబ్బుల లెఖ్ఖ తరువాత!'' అన్నాడు రంగనాథ్ చిన్నగా నవ్వి.

ఆయన ఒక్కక్షణం ఆగాడు. ''చేయిస్తానయ్యా చేయిస్తాను...ఇంటి యజమానికి తప్పుగుదా ఈ ఖర్మలన్నీ!...కాస్త రెండురోజులు సర్దుకో...డబ్బులు చూచుకోవాలా...ఆ విరక్కొట్టినవాటిని కొనుక్కురావాలా...ప్లంబర్‌ను పట్టుకోవాలా...అవునూ-ఎల్లాగైనా ఇవ్వాళో, రేపో మీరు ఖాళీ చేస్తూనే వున్నారుగదా...ఈ ఒక్కరోజూ మావైపు పంపులోనుంచి రెండు బక్కెట్ల నీళ్లు తెచ్చుకొని బాత్‌రూంలో పెట్టుకోండి...నేను బజారుకు వెళ్లి ఆ పనిమీదే వుంటాననుకో!'' ఆయన ఏదో చెప్పబోతున్న రంగనాథ్ మాటల్ను గూడా వినిపించుకోకుండా బయటకు పరుగెత్తాడు. వెళుతున్న ఆయనవైపే విచిత్రంగా చూస్తూ వుండిపోయాడు రంగనాథ్. అతడు ఊహించలేదు- ఆ ముసలాయనే తమను ఇల్లు ఖాళీ చేయించటానికి ఆ పని చేశాడని... రేపు కరెంటు తీసేస్తాడని...ఎల్లుండి బయటకు నీళ్లు పోయే గొట్టాలలో ఏదోటి అడ్డం పడేస్తాడనీను!...''

• • •

ఆఫీసునుంచి సరాసరి ఆసుపత్రికి వెళ్లాడు రంగనాథ్ ఆ సాయంత్రం. బెడ్ దగ్గరకు వెళుతుండగానే తల్లి ఎదురుగా వచ్చింది. ఆమె ముఖం కళకళలాడుతోంది. ఆమె నవ్వుతోంది.

''నాన్న కళ్లు తెరిచారురా...డాక్టరుగారు గూడా చూసి ఇక గండం గడిచినట్లేనమ్మా అన్నారు...నాన్నా! వెంటనే వెళ్లి సాయిబాబాకు కొబ్బరికాయ కొట్టిరారా!'' అన్నది.

''అలాగేనమ్మా!'' అన్నాడు రంగనాథ్. అతడికీ గుండె బరువు తీరి తేలికయినట్లనిపించింది. కష్టపడి పదిరోజులు ఎండ అనకా, వాన అనకా ఆసుపత్రి చుట్టూ తిరిగినందుకు ఫలితం దక్కింది. హాయిగా శ్వాస పీల్చుకున్నాడు. ఇంటికి వెంటనే వెళ్లి సావిత్రికి చెప్పాలి. అది గూడా సంతోషిస్తుంది! అనుకున్నాడు.

లోపలకు వెళ్లి కాసేపు తండ్రి మొఖంలోకి చూస్తూ నిలుచున్నాడు దూరం నుంచే.

''బహుశః రేపో ఎల్లుండో వార్డులోకి పంపిస్తారులే...అప్పుడు కూర్చుందువుగాని ఆయన దగ్గర!'' అన్నది అటుగా వస్తున్న సిస్టర్‌ను చూస్తూ- బయటకు వెళ్లు అన్నట్లుగా!

రంగనాథ్ బయటకు వచ్చాడు. ఇంకేమైనా కావాలేమోనని తల్లిని అడిగాడు. తరువాత గంటకు ఇంటికి జేరాడు. లోపల కాలు పెడుతూనే సావిత్రి చేయి పట్టుకొని సంతోషంగా, ''నాన్న కోలుకున్నాడే...ఓ వారం రోజుల్లో డిశ్చార్జి చేసినా చేయవచ్చు'' అన్నాడు.

ఆమె హాయిగా నవ్వుతూ, ''అలాగా...చాలామంచి వార్త చెప్పారండీ...నేను ఆసుపత్రికి వెళ్లి మామయ్యను ఒక్కసారి పలకరించి రావాలి'' అన్నది.

''ఇప్పుడొద్దులే...రేపు నువ్వే వెళ్దువుగాని!''

''అరె మర్చిపోయాను చెప్పటం...పాపం మన ఇంటాయనకు సివియర్ ఎటాక్ వచ్చిందండీ మధ్యాహ్నం... పన్నెండు గంటలకనగా అంతా హాస్పిటల్‌కు వెళ్లారు...ఇంకా ఎవ్వరూ తిరిగిరాలేదు...ఎలా వున్నాడో ఆయన!'' అన్నది సావిత్రి.

''ఇంట్లో ఎవరున్నారు?'' అన్నాడు హడావుడిగా లేస్తూ. ''కొత్తకోడలే బిక్కుబిక్కుమంటూ కూర్చొని వున్నది!'' ''ఏ ఆసుపత్రి?'' ''నిమ్స్‌కు తీసుకువెళ్లారు!'' ''వెళ్లి చూచొచ్చేదా?''

''ఏ వార్డులో వున్నాడని వెళతారు...అదో సముద్రం... ఇంటెన్సివ్ కేరులో వుంచారేమో గూడా...చూడటానికి ఎవరినీ రానీయరు గదా!'' అన్నది చిన్నగా.

''అయ్యో! రంగా...నిమ్స్‌కు ఫోనుచేస్తే వివరాలేమైనా చెప్పగలుగుతారేమో!...సరేగాని పాపం కొత్త పిల్ల...ఏమన్నా తిన్నదో లేదో కనుక్కున్నావా?''

''ఇప్పటిదాకా ఇక్కడే కూర్చొని వెళ్లిందిలేండి!''

''నేను ఇప్పుడే వెళ్లి ఫోను చేసి వస్తాను...అవసరం వుండి రమ్మంటే వెళ్తాను!'' అన్నాడు బయటకు వెళుతూ. ''కాఫీ త్రాగి వెళ్లగూడదూ...ఇప్పటిదాకా తిరగి తిరిగి వచ్చారు!''

''వద్దు...ఫోను పక్కనేగా చేసి వస్తాను...ఆసుపత్రికి వెళ్లాల్సివుంటే భోజనం చేసి వెళ్తాను!'' అన్నాడు గేటు దాటుతూ. గేటు దాటి రెండడుగులు వేశాడో లేదో వాకిట్లోకి వచ్చి అంబులెన్స్ ఆగింది- కాలు వెనక్కు తీశాడు ఏమిటా అన్నట్లుగా రంగనాథ్. ముందుగా ఇంటాయన కొడుకు ముందు సీట్లోనుంచి దిగాడు.

''ఎట్లా వున్నది నాన్నకు?'' దిగుతున్న అతడిని చూస్తూనే అతడి దగ్గరకు వెళ్లి చేయి పట్టుకొని అడిగాడు రంగనాథ్.

''పోయారండీ!'' ఒక్కసారిగా గుండె ఝల్లుమనేలా అన్నాడతడు.

''అరెరె...పొద్దున బాగానే వున్నారు!''

అంబులెన్స్ డోరును వెనక్కు వెళ్లి డ్రైవరు తెరిచాడు. ఇద్దరు డ్రైవర్ సాయం చేయగా స్ట్రెచర్‌ను క్రిందకు దించారు. తెరిచివున్న గేటులోనుంచి ఆ ఇంటి కొత్తకోడలు హడావుడిగా బయటకు వచ్చింది.

''ఏమైంది మామయ్యగారికి?''

భర్త అంబులెన్స్ లోపలనుండి దించిన స్ట్రెచర్ మీద వున్న శవాన్ని చూపించాడు. ఉబికి వస్తున్న దుఃఖంతో భార్య వంక చూచాడు.

''అయ్యో!'' ఆమెకూ దుఃఖం ఆగలేదు.

''ఎక్కడ వుంచాలి శవాన్ని?'' డ్రైవర్ ముందుకు వచ్చి అడిగాడు.

''హాల్లో ఎడం వైపుగా పడుకోబెట్టండి!'' అన్నాడు అతడు లోపలకు చేయి చూపిస్తూ. ఒక్కసారిగా కొత్తకోడలు భర్త దగ్గరికల్లా జరిగి, ''వద్దండీ!'' అన్నది చిన్నగా. ''ఏం...అదే విటి?'' అధాట్లుగా...ఉలిక్కిపడ్డట్లుగా అడిగాడు భార్యనే చూస్తూ అతడు.

''ఈ ఇంట్లో శుభకార్యం జరిగి ఇంకా మూడునెలలయినా కాలేదు... ఇప్పుడా శవాన్ని- అప్పుడు కట్టి ఇంకా తీయని మామిడి మండల క్రిందగా లోపలకు తీసుకెళ్లటం ఉన్నవాళ్లకు మంచిదిగాదండి... ఇంకా మాయని- గడపలకు పూసిన-పసుపు కుంకుమల మీదగా శవాన్ని దాటించటం ఇంటికి శుభం కాదండి!'' అన్నది తల వంచుకొని...తనూ అదుకు బాధపడుతున్నట్లుగా కాలిబ్రొటన వేలును పదే పదే నేలకు నొక్కుతున్నది. ''ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు...బుద్ధీ జ్ఞానముండే మాట్లాడుతున్నావా...ఆయన మా నాన్నే...ఈ ఇంటికి స్వంతదారుడే!'' అన్నాడు-ఆ అమ్మాయి ఆ ఇంటికి కొత్త అని గూడా చూడకుండా కోపంతో అరుస్తున్నట్లుగా. ఆమె సంశయిస్తున్నట్లుగా ఒక్కక్షణం ఆగి, ఎర్రగా నిప్పుల కొలిమిలా మండిపోతున్న భర్త మొఖంలోకి చూడలేనట్లుగా తల వంచుకొని, ''ఇవి నా మాటలు కాదండీ...మామగారివే...అంతేగాదు అత్తగారు గూడా మన పెళ్లయి సంవత్సరం దాటేటంతవరకూ ఈ ఇంట్లో కాలు పెట్టగూడదు!'' అన్నది నీళ్ల నములుతూ నంగినంగిగా.

అప్పుడు రాత్రి ఏడుదాటి అరగంటయింది. అప్పటికే ముసలాయన చావు వార్త విన్న ఆ చుట్టుపక్కల ఇళ్ల వాళ్లంతా బయటకు వచ్చి అంబులెన్స్ చుట్టూ నిలుచున్నారు-ఆ శవాన్ని చూస్తూ.

ముసలాయన కొడుక్కు భార్య మాటలు వింటూనే మతిపోయినంత పని అయింది. కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాడు. భార్య మెడ పట్టుకొని ముందుకు లాగి ఆ చెంపా ఈ చెంపా వాయించాలన్నట్లుగా చేయెత్తాడు.

-ఎంత అవమానం?

అతడి తల్లి కోడలి మాటలకు బిక్కచచ్చిపోయి నోట్లో చీరె చెంగు కుక్కుకొని కుళ్లి కుళ్లి ఏడుస్తున్నది కొడుకు వెనగ్గా నిలబడి. ఆ అమ్మాయి మళ్లీ గొంతు తెరిచింది.

''బ్రతికుండగా మామగారి నోటివెంట విన్న మాటలనే మీకు నేను చెప్పాను...అలా చెప్పటానికి నాకూ ఎంతో బాధగానే వున్నది...అందుకే అత్తగారు ఈ ఇంట్లో కాలు పెట్టేటంతవరకూ ఆమె ఎక్కడ వుంటే నేనూ అక్కడే వుంటాను...ఓ ఆడది భరించే రంపపు కోత ఎంత భయంకరమైనదో మరో ఆడదానికే తెలుస్తుంది...ఆమెను నేను ఎట్టి పరిస్థితులలోనూ విడిచి వుండలేను!'' అంటూ తన మెడమీద వున్న భర్త చేతిని చిన్నగా విడదీసింది. ఏం చేయాలో తెలియనట్లుగా తల వంచుకొని తల్లి ముందు నిలుచున్నాడు అతడు.

అంబులెన్స్ డ్రైవరు మరోసారి హెచ్చరించాడు. ''చెప్పండి సార్...ఎక్కడ వుంచమంటారు శవాన్ని?''

కొత్తకోడలు భర్త మొఖంలోకే సూటిగా చూస్తూ అన్నది. ''పెద్దవాడు- చనిపోయిన ఆయన ఆత్మ శాంతించాలీ అంటే ఆయన అభిప్రాయానికి మనం గౌరవం ఇవ్వాలి...లేదా- ఆయన ఆత్మ క్షోభించినా ఫరవాలేదంటారా- మిమ్మల్ని ఆపే శక్తిగాని, హక్కుగాని ఈ భూమ్మీద ఎవ్వరికీ లేదు...ఇక ఇప్పుడు విజ్ఞత నుపయోగించి నిర్ణయం తీసుకోవాల్సింది మీరు!''

-మామగారి మనస్తత్వం మీద గుండెల్లో ఏర్పరుచుకున్న కసిని అక్కడే ఆ గడప బయటే కక్కేసి, దానిని దాటి లోపలకు వెళ్లటం ఇష్టం లేదన్నట్లుగా చకచకా వెళ్లి అత్తగారి రెండు బుజాలు పట్టుకొని ఆనించి వలవలా ఏడ్వసాగింది- ఆ ఇంటి కొత్తకోడలు!

★